# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

**న్యూస్‌టుడే, సిరిసిల్ల(విద్యానగర్)**

పుట్టుకకి, బతుకకి ఆధారమైన వాటిని పూజించడం, గౌరవించడం తెలంగాణ సంస్కృతి.


సిరిసిల్లలో రద్దీగా మార్కెట్ ప్రాంతం

### నేటి నుంచి వేడుకలు ప్రారంభం


ఇందుకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగ. ఈ వేడుకలు బుధవారం తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభం కానున్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ ప్రాంతం, గాంధీచౌక్, మున్సిపల్ ప్రాంతాల్లో పూల కొనుగోలుదారులు, విక్రయదారులతో కిటకిటలాడాయి. గాజులు, పట్టు దుకాణాలు రద్దీగా మారాయి. మహిళలు రంగు రంగుల బతుకమ్మలు పేర్చి ఆడి, పాడనున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. మరోవైపు పాఠశాలల్లో, కళాశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను జరుపుకొన్నారు.


గంభీరావుపేటలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు

# మహాత్మా.. మన్నించు..!

## కలగానే మీ ఆశయాలు

**ఈనాడు, కరీంనగర్**



బాపూ జీవితం అన్ని తరాలకు ఆదర్శం. ఆయన మాటలు అనునిత్యం అనుసరణీయం. మహాత్ముడు చూపిన మార్గం శిరోధార్యం. జాతిపితగా.. గాంధీ తాతగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఆయన కలలు కన్న స్వరాజ్యం ఎలా ఉండాలి..? ప్రస్తుతం ఎలా ఉంటోంది.? అసలు ఆయన చెప్పిందేంటి.? మనం చేస్తున్నదేంటి? ఆచరణలో చూపమన్నదేంటి? మనం అనుసరిస్తున్నదేంటి? స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు వసంతాలు దాటినా.. మహనీయుడి బోధనలు, సూక్తులు.. జీవిత చరిత్రలోని మధురిమలు మాటలకే పరిమితమవుతున్నాయి.. ఆయన మాటల బాటలో మనమే విధంగా పయనిస్తున్నామనేందుకు మచ్చుకు కొన్ని ఇలా..

### హత్యలు.. దాడులూ..!



అహింసయే ఆయుధమని గాంధీజీ ఆచరణలో చూపారు. ఆయన మాటలు పెడచెవిన పెడుతూ నేడు పలువురు హింసా మార్గంలో నడుస్తున్నారు. కన్నకొడుకు తల్లిదండ్రులను, భార్య భర్తను హతమార్చే ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో నిత్యకృత్యమవుతున్నాయి. క్షణికావేశంలో కోపతాపాల్ని పెంచుకుంటున్నారు. భూతగాదాలకు, ఆర్థిక లావాదేవీలకు గొడవ పడుతూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. హత్యలు దోపిడీలు, ఆస్తుల విధ్వంసాలు, భయానక పరిస్థితులు పల్లె, పట్టణాల్లో రోజూ కనిపిస్తున్నాయి. 2023లో 103, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 80కిపైగా హత్యలు జరగడం పరిస్థితికి అద్దం పడుతోంది. మాట్లాడుకుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ఆ దిశగా అందరూ అడుగులు వేయాలి.

### అతివకు రక్షణేది?



అర్ధరాత్రి వేళ ఎలాంటి భయం లేకుండా స్త్రీ తిరగగలిగే రోజు రావాలన్నది బాపూ ఆశయం. కానీ ఇందుకు భిన్నంగా ఉమ్మడి జిల్లాలో పరిస్థితులున్నాయి. అతివలపై అఘాయిత్యాల పరంపర పెరుగుతోంది. గృహహింస కేసులు సగటు రోజుకు మూడు నమోదవుతున్నాయి. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అపహరణ కేసులు 2023లో 1,850 నమోదయ్యాయి. చిన్నారులపై అత్యాచారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సభ్యసమాజం తలదించుకునే విధంగా మహిళలకు ఇంటా బయట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు చట్టాలు పక్కాగా అమలవ్వాలి. నేరాల అదుపునకు చర్యలుండాలి.

### ఊరూరా మద్యం జోరు..

మద్యపాన నిషేధం అటకెక్కింది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. 1,218 గ్రామాల్లో దాదాపుగా 5వేలకుపైగా గొలుసు దుకాణాలు మద్యం అమ్మకాల కోసం పుట్టుకొచ్చాయి. ప్రజల ఆరోగ్యం పాడవటంతోపాటు చిన్న కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలోని 282 మద్యం దుకాణాల్లో రోజుకు సగటున రూ.8 కోట్ల వ్యాపారం జరుగుతుందంటే మద్యానికి ఎంత బానిసలవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పలు గ్రామాల్లో మద్యపానం తీరుని వ్యతిరేకించిన ఉదంతాలున్నా.. చాలాచోట్ల మాత్రం మందు బాబులు తమ జోరుని ఆపడం లేదు. ఏడాదికి తాగి వాహనాల్ని నడిపే వారిపై 52 వేల కేసులు నమోదవుతున్నాయి.



### అవినీతి పాళ్లూ అధికమే..!

ఉమ్మడి జిల్లాలో అవినీతి శాఖోపశాఖలుగా విస్తరిస్తోంది. ఏడాదికి సగటున 15 మంది అధికారులు పనికోసం లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారు. అనధికారికంగా అవినీతి సొమ్ము రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతోంది. నీతి నిజాయతీని మరిచి లంచగొండులుగా మారే వారి సంఖ్య అన్ని కార్యాలయాల్లో కనిపిస్తోంది. పని కావాలంటే పైసలు ముట్టజెప్పాలనే సంస్కృతి నేటి కాలంలో పెరుగుతుండటం గాంధీజీ ఆశయాలకు విరుద్ధం. అవినీతిని అరికట్టే దిశగా కలిసి కట్టుగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలి.

### ‘స్వచ్ఛ’ బాటలో పారస్పృహ పెరగాలి

పరిశుభ్రతే దైవత్వం అన్న మహాత్ముడి ఆశయానికి అనుగుణంగా అడుగులు పడుతున్నా ఇంకా పరిస్థితి పూర్తిగా మారడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ దర్పణ్ జాతీయ అవార్డులను పలు పంచాయతీలు, పట్టణాలు అందుకుంటుండగా.. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కరవై రోగాలు విజృంభిస్తున్నాయి. తడి, పొడి చెత్త సేకరణ మాటలకే పరిమితమవుతోంది. ప్రతి ఒక్కరూ పౌరస్పృహతో పరిశుభ్రత పాటిస్తేనే.. స్థానిక సంస్థలు ఆవైపుగా చర్యలు తీసుకుంటేనే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యం.

# ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వేములవాడ అభివృద్ధి


మాట్లాడుతున్న దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వేదికపై విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**వేములవాడ, న్యూస్‌టుడే:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణానికి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడలోని రాజన్నను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో విప్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, వివిధ శాఖల అధికారులతో ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక రూపకల్పన, విస్తరణ, సుందరీకరణ తదితర అంశాలపై ఆమె సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళికలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమెకు వివరించారు. వేములవాడకు 35 కిలోమీటర్ల పరిసరాల్లో ఉన్న కొండగట్టు, నాంపల్లిగుట్ట, సిరిసిల్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, దిగువ, మధ్య మానేరు జలాశయాలు, ఎలగందుల కోట, అనంతసాగర్ జలపాతం తదితర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొదటి దశలో రూ.70 కోట్లతో రాజన్న ప్రధాన ఆలయ విస్తరణకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఆలయానికి అందుబాటులో ఉన్న 36 ఎకరాల స్థలంలో వసతి గృహాలు, దేవస్థానం కార్యాలయాలు, పార్కింగ్, క్యూ కాంప్లెక్స్, సాంస్కృతిక జోన్, ఇతర అభివృద్ధి పనులకు రూ. 275 కోట్లతో ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ప్రసాద్ పథకంలో వేములవాడ ఎంపికైందని, ఆ నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం



రుద్రంగి మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి మండల కేంద్రానికి అనుబంధంగా ఉన్న కొచ్చెగుట్ట తండాకు వెళ్లే మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగు కాలువల్లో భారీగా వరద వచ్చి తండాకు వెళ్లే మార్గంలో ఉన్న సీసీ రోడ్డు దిగువన ఉన్న మట్టి కోతకు గురైంది. దీంతో భారీ వాహనాలు ఈ మార్గంలో వెళ్తే రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంగి**

# శ్రమించారు... కొలువు సాధించారు

**న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్), అర్బన్**

ఉపాధ్యాయ కొలువులు సాధించాలని భావించారు. లక్ష్య సాధన కోసం ఏళ్లుగా శ్రమించారు. మొదటి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా నిరంతరం సాధన చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కలలను సాకారం చేసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు సిరిసిల్లకు చెందిన పలువురు అభ్యర్థులు.

### దుబాయి వెళ్లి వచ్చి...



వేములవాడ మండలం శాత్రాజుపల్లికి చెందిన ముస్కు సంతోష్‌రెడ్డి ఎమ్మెస్సీ బీఈడీ చేశాడు. ఎస్‌ఏ ఆంగ్లంలో జిల్లాలో రెండో ర్యాంక్ సాధించాడు. 77 మార్కులు వచ్చాయి. రైతు కుటుంబానికి చెందిన ఇతను ఉపాధి కోసం ఐదు సంవత్సరాలు దుబాయ్ వెళ్లి వచ్చి డీఎస్సీకి సిద్ధమయ్యాడు. కొలువు సాధించాడు.

**ముస్క సంతోష్‌రెడ్డి డీఎస్సీలో 2వ ర్యాంక్**

### రెండోసారి...



సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని పెద్దబోనాలకు చెందిన కాశెట్టి యుగంధర్ ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశాడు. ఇటీవల టీజీటీగా ఎంపిక కావడంతో మహాత్మాజ్యోతిబా పులే గురుకులంలో పని చేస్తున్నాడు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఎస్‌ఏ (బయోలాజికల్ సైన్స్)గా ఎంపికయ్యాడు. 85 మార్కులు సాధించి జిల్లాలో రెండో ర్యాంక్ సాధించాడు.

**-కాశెట్టి యుగంధర్ రెండో ర్యాంకర్**

### ఆటో డ్రైవర్ కొడుకు...



నేను 2017లో డీఎస్సీ రాసి విఫలమయ్యాను. అప్పటి నుంచి పట్టు వదలకుండా చదివాను. మా నాన్న ఆటో డ్రైవర్. అమ్మ గృహిణి. నేను బీఎడ్, డీఈడీ పూర్తి చేశాను. ఇంట్లోనే ఉంటూ పరీక్షకు సిద్ధమయ్యాను. పాఠ్య పుస్తకాలు చదవడంతోపాటు ఆన్‌లైన్ క్లాసులు విన్నాను. ఇటీవల గురుకుల టీజీటీగా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం మండెపల్లి గురుకులంలో పని చేస్తున్నాను. రెండో ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. **- జంగిటి భానుచందర్, ఎస్‌ఏ (రసాయన శాస్త్రం), రెండో ర్యాంకర్**

### రాత్రి 3 గంటల వరకు చదువుకునేదాన్ని



నేను బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఎమ్మెస్సీ చేస్తున్నాను. 2017 సంవత్సరంలో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించాను. ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను. పాఠశాలకు వెళ్లి వచ్చాక, సెలవు రోజులను వినియోగించుకున్నాను. ముఖ్యంగా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్నాను. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. బాబుకు ఇప్పుడు ఏడాది వయసు. చిన్న బాబును చూసుకుంటూ చదవడం ఇబ్బందిగా ఉండేది. అయినప్పటికీ రాత్రి 3 గంటల వరకు చదువుకున్నాను. ఇందులో నా భర్త సహకారం ఎంతో ఉంది. పాఠ్య పుస్తకాలు ఎక్కువగా చదివాను. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకుని చదివాను. మొదటి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది.


**- నాము శ్రీలత, సిరిసిల్ల, ఒకటో ర్యాంకర్, రసాయన శాస్త్రం**

# విద్యుత్తు విఘాతం

## టెక్స్‌టైల్ పార్కులో యూనిట్ల మూసివేతకు నిర్ణయం

**ఈనాడు, సిరిసిల్ల**

జిల్లాలో ఆధునిక మరమగ్గాల వస్త్రోత్పత్తుల కేంద్రమైన టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేక... మరోవైపు విద్యుత్తు బిల్లులు గుదిబండలా మారాయి. మొన్నటి వరకు ప్రభుత్వ ఆర్డర్లతో అరకొరగా నడిచిన యూనిట్లు ఇప్పుడు మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఇందులోని 20 మూతపడ్డాయి. వీటిలో పని చేసే సుమారు వందకు పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు. మంగళవారం పార్కులోని యూనిట్ల యజమానులు సమావేశమయ్యారు. ఉత్పత్తి చేసిన వస్త్రాలకు విక్రయాల్లేక కొత్త ఆర్డర్లకు పెట్టుబడి లేక.. కార్మికుల వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఈ నెల 6 నుంచి మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.



టెక్స్‌టైల్ పార్కు ప్రధాన ద్వారం

● టెక్స్‌టైల్ పార్కులో తయారయ్యే వస్త్రం జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేకపోతోంది. దీంతో వీరు పక్క రాష్ట్రాల నుంచి ఆర్డర్లు తెచ్చుకుని ఉత్పత్తి చేస్తున్నారు. దానికీ విద్యుత్తు ఛార్జీలు భారం అయ్యాయి. సొంతంగా ఉత్పత్తి చేసి మార్కెట్ చేద్దామంటే ముడి సరకు అందుబాటులో ఉండదు. ఇన్ని ఒడుదొడుకులను ఎదుర్కొంటూ పరిశ్రమను నెట్టుకురాలేని పరిస్థితిలో యజమానులు మూసివేయాలనే ఆలోచన చేస్తున్నారు. వీరి నిర్ణయంతో పార్కులో వివిధ రంగాల్లో పని చేసే కార్మికులకు ఉపాధి దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయి.

● టెక్స్‌టైల్ పార్కులో వస్త్రోత్పత్తి యూనిట్లకు విద్యుత్తు సమస్య ప్రధానమైంది. 2003లో టెక్స్‌టైల్ పార్కు ప్రారంభమైంది. 2014 డిసెంబరు వరకు విద్యుత్తు బిల్లుల రీయింబర్స్‌మెంటు కింద రూ. 8.68 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015 జనవరి నుంచి 2020 డిసెంబరు వరకు పలు విడతల్లో రూ. 15 కోట్లు విడుదల చేశారు. 2021 జనవరి నుంచి రీయింబర్స్‌మెంటు విడుదల కావడం లేదు. దీంతో పరిశ్రమలు అతి కష్టం మీద నడుస్తున్నాయి.

● దేశంలోనే మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో పేరున్న మహారాష్ట్రలోని భీవండిలో ఇటీవల అక్కడి ప్రభుత్వం 27 హార్స్‌పవర్ వరకు విద్యుత్తును వినియోగించేవారికి యూనిట్‌కు రూ. 1, అంత కంటే ఎక్కువ ఉంటే రూ. 0.75 లను రాయితీగా ఇస్తామని ప్రకటించింది. మన దగ్గర రాయితీ కాకుండా ప్రభుత్వం రీయింబర్స్‌మెంటు రూపంలో చెల్లిస్తుంది. దాదాపు నాలుగేళ్ల నుంచి ఇది కూడా రావడం లేదు. ఇక్కడ ఉన్న చిన్న, మధ్య తరహా వస్త్రోత్పత్తి యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు రాయితీ అందజేయాలని ఇది వరకే యజమానులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాలేదు.

# ప్రకృతి సంపదను చెరబట్టి..

# రాయల్టీకి గండికొట్టి

**ఈనాడు, సిరిసిల్ల**

ప్రకృతి సంపదను అక్రమార్కులు చెరబట్టారు. ప్రభుత్వ నిర్మాణాలకిచ్చిన తాత్కాలిక అనుమతులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు అవసరాలకూ తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల రాయల్టీకి గండి పడుతోంది. వీటిపై తరచూ జిల్లా రెవెన్యూ, గనుల శాఖలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వెళ్తే అక్కడెవరూ కనిపించరు. ఇది మరీ విచిత్రమైన పరిస్థితి. జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దూరులోని మైసమ్మ గుట్టకు చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. అక్రమార్కులు వీటిని చెరిపేస్తున్నారు.

### ఆనవాళ్లు కోల్పోతున్న మైసమ్మ గుట్ట

### యంత్రాలతో తవ్వేస్తూ...

మానేరువాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం సమయంలో రెండువైపులా కాంక్రీటుతో రక్షణ గోడలు నిర్మించాలి. దీనికి బలం చేకూర్చేందుకు మట్టితో నింపి రాళ్లతో తెట్టును నిర్మించాలి. అప్పుడే చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుంది. అయితే చెక్‌డ్యాం తొలి అంచనాల్లో ఈ ప్రతిపాదన లేదు. వరదలకు చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడంతో మట్టికట్ట, తెట్టు నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. దీనికోసం ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలకు మైసమ్మగుట్టను సగానికిపైగా తొలిచేశారు. ఇప్పుడు మట్టి తవ్వకాల్లో బయటపడిన రాళ్లను తొలుస్తున్నారు.


అరుదైన మట్టి ప్రతిమలు


గుట్టపై తవ్వకాలు

### పరిశోధకులు గుర్తించినా...

జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతంలో ఆదిమానవుల జీవనవిధానాలను చరిత్రకారులు కనుగొన్నారు. సిరిసిల్ల శివారులోని బర్కమ్మ, సీతారి గుట్ట ప్రాంతాల్లో పలు రాతి చిత్రాలు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా పరిశోధనలు కూడా జరిగాయి. మైసమ్మ గుట్ట పూర్వం వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు పరిశోధకులు అధ్యయనాల్లో గుర్తించారు. ఇక్కడ ఉన్న మట్టి ప్రతిమలను గ్రామదేవతలుగా ఇప్పటికీ కొలిచి పూజలు చేస్తారు. అందుకే దీనికి మైసమ్మ గుట్టగా పేరు వచ్చింది.

● చరిత్ర పరిశోధకులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రతిమలు ఎక్కడా చూడలేదని చెబుతున్నారు. ఇవి ఎప్పటివనేది కూడా నిర్ధారణ కాలేదు. పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లో కొన్ని రూపాలు గ్రామ దేవతలుగా కొలుస్తారని మాత్రం చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అరుదైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గుట్ట చుట్టూ తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

### ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం

గుట్ట ప్రాంతంలో మట్టి తవ్వకాలకు అనుమతుల్లేవు. ఇది వరకు మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి పరిశీలిస్తాం. తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

**- క్రాంతికుమార్, జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకుడు**

# కార్యకలాపాలు నిలిపివేయండి!

## డీసీఎంఎస్ పాలకవర్గానికి తాఖీదులు?

**ఈనాడు, కరీంనగర్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పాలకవర్గ కార్యకలాపాలు తక్షణమే నిలిపివేయాల్సిందిగా సహకారశాఖ ఉన్నతాధికారులు తాఖీదులు జారీ చేసినట్లు తెలిసింది. సరైన కోరం లేకపోవడంతో ఇక మీదట ఆర్థిక లావాదేవీల నిర్వహణ సహా పాలనాపరంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదనే ఆదేశాలిచ్చినట్లు సమాచారం. సుమారు నాలుగేళ్ల కిందట 10 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ధర్మపురి పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికవగా.. వైస్ ఛైర్మన్‌గా కొత్తపల్లి వినియోగదారుల సంఘం ఛైర్మన్‌గా ఉన్న ఫక్రొద్దీన్ ఎన్నికయ్యారు. పాలకవర్గంలో మెజారిటీ డైరెక్టర్లంతా భారాస పార్టీ మద్దతుదారులే. వీరంతా 2020 ఫిబ్రవరి 28న పదవి బాధ్యతల్ని చేపట్టారు. డీసీఎంఎస్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమయ్యారు.

### కోరం లేక..

ప్రస్తుతం ఈ సొసైటీ పాలకవర్గం మనుగడకు అవసరమైన కోరం లేకపోవడంతో సహకార శాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని ఎంపిక చేసిన కొన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఛైర్మన్‌లు ఇందులో డైరెక్టర్లుగా ఉన్నారు. అప్పట్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎంపిక విషయంలో రాజకీయంగా తర్జనభర్జన జరిగింది. భారాసలోనే పలువురు ఈ స్థానం కోసం పోటీ పడ్డారు. ఎట్టకేలకు అధిష్ఠానం ఆదేశాలతో శ్రీకాంత్‌రెడ్డికి ఛైర్మన్‌గా అవకాశాన్ని కల్పించారు. రామడుగు పీఏసీఎస్ ఛైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు ఛైర్మన్ గిరికి పోటీ పడ్డారు. ఆ సమయంలో ఆయన్ని సముదాయించి కొన్నేళ్ల తరువాత ఇస్తారనే మాటలు వినిపించాయి. ఇటీవల కొన్నాళ్లుగా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ సొసైటీలోని డైరెక్టర్లుగా ఉన్న పీఏసీఎస్ ఛైర్మన్లు కొందరు వివిధ కారణాలతో ఆ పదవి నుంచి వైదొలిగారు. అవిశ్వాస తీర్మానం కారణంగా నుస్తులాపూర్ (కరీంనగర్ జిల్లా), నర్సింగపూర్ (రాజన్న సిరిసిల్ల జిల్లా) ఛైర్మన్‌లతోపాటు మరికొందరు వారి పదవిని కోల్పోయారు. ఒక డైరెక్టరు మరణించారు. మరో డైరెక్టరు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. ఇలా ఒక్కొక్కరు దూరమవగా.. ప్రస్తుత పాలకవర్గంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లతో కలిపి కేవలం నలుగురే మిగిలారు. దీంతో సహకార శాఖ నిబంధనల ప్రకారం సరైన కోరం లేనందున ఈ పాలకవర్గం సమావేశాలు నిర్వహించొద్దని తేల్చిచెప్పినట్లు సమాచారం.

## ప్రాంతీయ ఆసుపత్రికి కాయకల్ప అవార్డు

**వేములవాడ:** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి మంగళవారం కాయకల్ప అవార్డు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డు రావడం ఇది మూడోసారి అని ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య తెలిపారు.

## దేవీ నవరాత్రోత్సవాలకు రాజన్న ఆలయం ముస్తాబు

**వేములవాడ, న్యూస్‌టుడే:** వేములవాడలోని రాజన్న ఆలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు జరిగే దేవీ నవరాత్రోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఇప్పటికే అమ్మవారికి మండపం నిర్మాణం, విగ్రహాలను శుభ్రం చేసే పనులను పూర్తి చేశారు. ఆలయ ప్రాకారాలు, గోపురాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

**సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**కొత్తపల్లి(గంభీరావుపేట), న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులు అక్షయ్, రామ్‌కిరణ్, హర్షిణి, లక్ష్మీసందీప్, స్వాతి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బార భాను తెలిపారు.







# ముందస్తు బతుకమ్మ సంబరాలు


సిరిసిల్లలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో...


శ్రీకృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో...


నెహ్రూనగర్‌లో...


సిరిసిల్ల: సరస్వతి స్కూల్‌లో...


నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో...

జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం సాయంత్రం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం విద్యా సంస్థల ఆవరణలో ఉంచి ఆడి పాడారు. తరవాత నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే బృందం


కోనరావుపేటలో...


రాచర్ల బొప్పాపూర్‌లో...


శివనగర్‌లో...


అగ్రహారం డిగ్రీ కళాశాలలో...


గీతానగర్‌లో...


గర్లపల్లిలో...


విలాసాగర్‌లో..


చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో...


ముస్తాబాద్‌లో...


సిరిసిల్ల: వివేకానంద విద్యానికేతన్‌లో...

## కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

**సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే:** మంత్రి కొండా సురేఖపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత మాట్లాడుతూ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిపై భారాస నాయకులు సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్స్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులు మంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, నాయకులు గోనె ఎల్లప్ప, భాను, ప్రశాంత్ పాల్గొన్నారు.


సిరిసిల్లలో దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కోలుకున్న పాముకాటు బాధిత విద్యార్థి

**ఎల్లారెడ్డిపేట:** ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి వసతి గృహంలో పాముకాటుకు గురై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన విద్యార్థి రమావత్ రోహిత్ పూర్తిస్థాయిలో కోలుకోగా సోమవారం సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన రోహిత్ వసతి గృహంలో ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పాముకాటుకు గురై అస్వస్థత చెందిన విద్యార్థికి వైద్యులు సత్యానారాయణస్వామి, అభినయ్ మెరుగైన వైద్యం అందించడంతో కోలుకున్నాడు.

## రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

**తుర్కపల్లె (ముస్తాబాద్), న్యూస్‌టుడే:** ముస్తాబాద్ మండలం తుర్కపల్లెలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులను పనులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు ఏయే స్థాయిలో ఉన్నాయో పరిశీలించారు. పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు మంజూరు చేసేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే:** దేశంలో ప్రతి పరిశ్రమల్లో సాంకేతిక నిపుణులు అవసరమని, ఐటీఐ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కన్వీనర్ డి.కవిత పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాధు వెంకట్‌రెడ్డి ఐటీఐ శిక్షణ కేంద్రంలో స్నాతకోత్సవంలో భాగంగా వివిధ ట్రేడ్‌లలో శిక్షణను పూర్తిచేసుకున్న విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం ద్వారా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగతోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్వచ్ఛతాహీ సేవలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వనజకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.


డీఐఈవో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

## 4న ఆలయాల హుండీ లెక్కింపు

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** సిరిసిల్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీవిశ్వనాథస్వామి, పోచమ్మ, శివసాయి బాబా ఆలయాల హుండీలను ఈ నెల 4న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో లెక్కించనున్నట్లు వేంకటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతీరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పవర్‌లూం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే:** పవర్‌లూం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అఖిల భారత పద్మశాలి సంఘం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని చేనేత, వస్త్ర వ్యాపార సంఘ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపాముల దామోదర్, గడ్డం జగన్నాథం, రాంచందర్‌రావు, భాస్కర్, గోలి వెంకటరమణ, సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేత కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు

**వేములవాడ, న్యూస్‌టుడే:** నేత కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడలో పర్యటించిన ఆమె నేత కార్మికుల సమస్యలు, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బిల్లులు, ఆర్డర్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూలు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, టెస్కో జీఎం అశోక్, చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్, నేత కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుకు కృషి చేయండి

**వేములవాడ, న్యూస్‌టుడే:** భాజపా సభ్యత్వ నమోదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. మంగళవారం వేములవాడలోని భీమేశ్వరగార్డెన్‌లో భాజపా మండల, పట్టణ అధ్యక్షులు, ఆఫీస్ బేరర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాజపా సభ్యత్వ నమోదు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మీసాల చంద్రయ్య, నియోజకవర్గ బాధ్యుడు చెన్నమనేని వికాస్‌రావు, రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్, పట్టణ అధ్యక్షుడు సంతోష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వం అందజేస్తున్న వికాస్‌రావు తదితరులు

**ధర్మారం (కోనరావుపేట):** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా సత్తా చాటాలని పార్టీ వేములవాడ నియోజకవర్గ బాధ్యుడు చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా మండలాధ్యక్షులు రామచంద్రం, జిల్లా, మండల, బీజేవైఎం, శక్తి కేంద్రం బాధ్యులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి

### భర్త, కుటుంబ సభ్యుల వేధింపులే కారణమని ఫిర్యాదు

**కోనరావుపేట, న్యూస్‌టుడే:** మండలంలో మంగళవారం అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం... కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన అల్లెపు శ్రీనివాస్‌కు, నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన జ్యోతి (23)తో 2021 జనవరిలో వివాహమైంది. ఏడాది పాటు వీరి కాపురం సవ్యంగా సాగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు మాన్విత, హిరణ్య ఉన్నారు. జ్యోతి ప్రస్తుతం రెండు నెలల గర్భిణి. భర్త తరచూ మద్యం తాగి వచ్చి గొడవ పడగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో మాట్లాడుకొన్నారు. అయినప్పటికీ భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా, మానసికంగా వేధించేవాడు. గత నెల 17న శ్రీనివాస్‌తోపాటు కుటుంబ సభ్యులు వేధించి కొట్టారని జ్యోతి తన అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సర్ది చెప్పి మరుసటి రోజు అత్తగారింటికి పంపించారు. మంగళవారం ఉదయం శ్రీనివాస్ ఫోన్ చేసి మీ కూతురు చనిపోయిందని చెప్పగా కుటుంబ సభ్యులంతా నిమ్మపల్లి వచ్చారు. జ్యోతి అనుమానాస్పదంగా చనిపోయి ఉంది. శరీరమంతా గాయాలున్నాయి. తన కూతురు మృతికి కారణమైన భర్త శ్రీనివాస్, మామ మల్లయ్య, ఆడపడుచు మల్లవ్వ, చిన్నత్త రామయ్య, తోటి కోడలు వసంతపై చర్యలు తీసుకోవాలని తండ్రి ఉప్పు ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబీకులు, బంధువులు దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న ఉద్దేశంతో అంత్యక్రియలు ముగిసే వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


జ్యోతి

## వరద కాలువలో యువ రైతు గల్లంతు

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** వరద కాలువలో ఉన్న మోటారు మరమ్మతు కోసం నీటిలో దిగిన యువ రైతు విద్యుదాఘాతంతో గల్లంతైన సంఘటన మంగళవారం దేశాయపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొదురుపాక గ్రామానికి చెందిన నాగుల లచ్చయ్య-దేవలక్ష్మికి ఐదుగురు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగో కుమారుడు నాగుల కిషన్ గౌడ్ (34) దేశాయపల్లి వద్ద ఆరెకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. వరద కాలువలో మోటారు ఏర్పాటు చేసుకొని పొలానికి నీరందిస్తున్నాడు. పైపులైన్ లీకేజీతో నీరు రాకపోవడంతో గ్రామానికి చెందిన కనకయ్య, శేఖర్‌తో కలిసి వరద కాలువ వద్దకు వెళ్లి మరమ్మతు చేశాడు. మరోవైపు పైపు అందకపోవడంతో నీటిలోని మోటారు పైకి జరిపేందుకు అందులో దిగగా విద్యుదాఘాతం ఏర్పడి కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కనకయ్య, శేఖర్ వెంటనే మోటారుకు సంబంధించిన ఫ్యూజులు తీసివేశారు. కిషన్ గౌడ్‌తోపాటు మరో పది మంది రైతుల వ్యవసాయ మోటార్లు అక్కడ ఉన్నాయి. వాటిలో ఒక దాని వైరు తేలడంతో నీటిలో దిగిన వెంటనే విద్యుదాఘాతానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులతో వెతికించినా ఆచూకీ లభించలేదు. సంఘటనా స్థలాన్ని తహసీల్దారు పుష్పలత, ఎస్సై పృథ్వీధర్ గౌడ్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ పరిశీలించారు. చీకటి పడటంతో గాలింపు నిలిపివేశారు. వరదవెల్లి వద్ద క్రాస్ రెగ్యులేటరు గేట్లను కిందికి దింపివేశారు.


కిషన్ గౌడ్

### మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

కిషన్ గౌడ్ గల్లంతైన విషయం తెలియడంతో స్వగ్రామం కొదురుపాకలోని ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

## నేర వార్తలు

ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన రేఖతో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. నలభై రోజుల క్రితం పాప పుట్టడంతో ఇటీవల నామకరణం చేశారు.

## చికిత్స పొందుతూ కూలీ మృతి

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** చికిత్స పొందుతూ కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... వెంకట్రావుపల్లికి చెందిన ఎల్లయ్య (56) సోమవారం రోడ్డు దాటుతున్న సమయంలో సిరిసిల్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎల్లయ్య మృతి చెందాడు. డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సు నడిపి ఎల్లయ్యను ఢీకొట్టడంతో మృతి చెందాడని అతని భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ఎల్లయ్య

## ఉంగరం అపహరించిన వ్యక్తి అరెస్టు

**గంభీరావుపేట, న్యూస్‌టుడే:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన గుండెల్లి అమృతలాల్‌కు చర్మ వ్యాధి తగ్గిస్తానని, పసరు మందు ఉందని నమ్మబలికి గత నెల 29న గుర్తు తెలియని వ్యక్తి చేతికి ఉన్న ఆరు గ్రాముల బంగారు ఉంగరాన్ని ఎత్తుకెళ్లాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శివకుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్నారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన దండుగ సాయిలును అరెస్టు చేశారు. ఆ ఉంగరాన్ని కొన్న గంభీరావుపేటలోని అల్లపల్లి నరేశ్‌ను కూడా అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఎన్టీపీసీకి అవార్డుల పంట

## పలు రాష్ట్రాల పరిశ్రమలతో పోటీపడి విజేతగా..



ఎన్టీపీసీ సోలార్ ప్లాంటు అంతర్జాతీయ ఎనర్జీ అవార్డును స్వీకరిస్తున్న ఈడీ కేదార్ రంజన్‌పాండు

న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

ఎన్టీపీసీ రామగుండానికి అవార్డుల పంట పడింది. పరిశ్రమలు ఉన్నత స్థానాల్లో నిలవాలంటే అధికారి మొదలు కార్మికుల వరకు అంకిత భావంతో పనిచేస్తేనే సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తోంది. దీనికి అనుగుణంగానే ఎన్టీపీసీ ఉన్నతికి ఉద్యోగులు పాటుపడుతున్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో గత 8 నెలల వ్యవధిలో ఎన్టీపీసీ 9 అవార్డులు కైవసం చేసుకుంది. ఇతర రాష్ట్రాల పరిశ్రమలతో పోటీపడి ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది.



ఎన్టీపీసీ రామగుండం పవర్ ప్లాంటు

## సాధించిన అవార్డులు..

- న్యూదిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ 2024 అవార్డు ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండానికి ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు దక్కింది. పవర్ ఎక్సలెన్స్‌లో విజయం సాధించినందుకు, ఇంధన రంగాల్లో ముందుంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేసినందుకుగాను.. ఈ అవార్డును కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సెప్టెంబరు 26న అందజేశారు.
- పలు రాష్ట్రాలతో పోటీపడి కొత్త ఆవిష్కరణలు, నూతన అంశాలను వివరిస్తూ.. ఇంధన అభివృద్ధికి కృషి చేసినందుకుగాను పవర్ విభాగంలో ఎనర్జీ కంపెనీ అవార్డును రామగుండం ఎన్టీపీసీ కైవసం చేసుకుంది.
- కోజికోడ్‌లోని తాజ్‌గేట్‌వేలో ఇటీవల నిర్వహించిన జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో మూడు బంగారు, రెండు కాంస్య అవార్డులు సైతం దక్కించుకుంది. ఆగస్టు 25న ఎన్టీపీసీ రామగుండం పరిధిలోని గ్రామీణ క్రీడల నైపుణ్యం, సామాజిక అవగాహన యాడ్ ఫిల్మ్, హెచ్‌ఆర్ వైవిధ్యం, ప్రజా అధారిత అభ్యాసాలు, సీఎస్‌ఆర్ ఆవిష్కరణలో సత్తాచాటినందుకు అవార్డులు కైవసం చేసుకుంది.
- ఎన్టీపీసీ రామగుండం సోలార్ ప్లాంటుకు మార్చి 15న అంతర్జాతీయ ఎనర్జీ అవార్డు దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లోని సౌర ఎనర్జీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో నీటిలో తేలియాడే అతిపెద్ద సోలార్ ప్లాంటు విద్యుత్తు ఉత్పత్తి నిర్వహణపై సౌర ట్రెయిల్ బ్లేజర్స్ అవార్డుతోపాటు.. ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటుకు ఈ అవార్డు లభించింది.
- ఆరో జాతీయ ఎనర్జీ సమితి ఆధ్వర్యంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండంలోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు.. ఫిబ్రవరి29న 'సస్టెయినబుల్ అండ్ రెజిలియెంట్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఎస్‌ఆర్‌ఈఐ) అవార్డు కైవసం చేసుకుంది. మే 23న పీఎంఐ వేదికపై ఇటీవల జరిగిన పవర్ క్విజ్ పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులు విజేతలుగా నిలిచి అవార్డు, బహుమతి పొందారు.






జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న జట్టు(పాత చిత్రం)

# క్రీడా మెరుపులు

## బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు జగిత్యాల విద్యార్థులు

న్యూస్‌టుడే, జగిత్యాల క్రీడావిభాగం



జగిత్యాలకు చెందిన పలువురు విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రీడా పోటీల్లోనూ రాణిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుల మార్గదర్శనంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు క్రీడాకారులు 'న్యూస్‌టుడే'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆ వివరాలు..

### ఆరేళ్లుగా సాధన



జగిత్యాలకు చెందిన **పూరెల్ల కావ్యశ్రీ**కి మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. బాస్కెట్ బాల్ క్రీడలో ప్రత్యేకత సాధించింది. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యాపారి కాగా, తల్లి లావణ్య గృహిణి. ఆరేళ్లుగా నిత్యం ఉదయం, సాయంత్రం గంటన్నర చొప్పున క్రమం తప్పకుండా సాధన చేస్తోంది. పీఈటీల నుంచి మెలకువలు నేర్చుకొని పదిసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఒకసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కావ్యశ్రీ జట్టును ముందు వరుసలో నిలపడంలో కీలక పాత్ర పోషించింది. సివిల్స్ సాధించడమే లక్ష్యమని పేర్కొంది.

### ఐఏఎస్‌గా సేవ చేస్తా



జగిత్యాల పట్టణం పోచమ్మవాడకు చెందిన **కొక్కు మణికంఠ** బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. తండ్రి లక్ష్మణ్ ప్రైవేటు ఉద్యోగి కాగా తల్లి భాగ్యలక్ష్మి బీడీలు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటోంది. కరీంనగర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా సాధన చేస్తూ బాస్కెట్‌బాల్ క్రీడపై పట్టు సాధిస్తున్నాడు. ఒకసారి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మణికంఠ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఎన్‌సీసీ క్యాడెటుగా చురుకుగా వ్యవహరిస్తుండగా ఐఏఎస్ అధికారిగా సమాజానికి సేవ లందిస్తానని చెప్పాడు.

### చదువుతోపాటు క్రీడలు



జగిత్యాలకు చెందిన చెన్నాడి శరణ్య చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోంది. హైదరాబాద్‌లో సీబీఎస్‌ఈ పదకొండో తరగతి చదువుతున్న శరణ్య బాస్కెట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎదిగింది. తండ్రి సత్తిరెడ్డి మందుల దుకాణం నిర్వహిస్తుండగా, తల్లి మధురిమ గృహిణి. వ్యాయామ ఉపాధ్యాయుల మార్గదర్శనంలో రెండు పూటలా సాధన చేస్తూ పట్టు సాధిస్తోంది. ఆరు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అవకాశం చేజిక్కించుకొని ప్రతిభ చాటింది. ఇండస్ట్రియల్ విభాగంలో ప్లాంట్ ఇంజినీర్‌గా స్థిరపడటం లక్ష్యమని పేర్కొంది.

### ఐపీఎస్ లక్ష్యం



జగిత్యాల పట్టణానికి చెందిన **చంద్రపల్కా కారుణ్యా సిలియా** బాస్కెట్‌బాల్ పోటీల్లో తన కంటూ ప్రత్యేకతను చాటుతోంది. హైదరాబాద్ కోఠి మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లి ఎస్తేర్‌రాణి ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా కుటుంబాన్ని పోషిస్తోంది. నిత్యం మూడు గంటల పాటు సాధన చేస్తూ ఆటపై పట్టు సాధిస్తోంది. పన్నెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఐపీఎస్ అధికారిగా రాణించడం లక్ష్యమని చెప్పింది.

### అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తా



జగిత్యాల పట్టణంలో తొమ్మిదో తరగతి చదువుతున్న **తుంగతుర్తి సంజన**కు బాల్యం నుంచే క్రీడలంటే అమితమైన ఆసక్తి. తండ్రి రవీందర్‌రావు ప్రైవేటు ఉపాధ్యాయుడు కాగా తల్లి త్రివేణి గృహిణి. ఇద్దరి ప్రోత్సాహంతో బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తోంది. ప్రతి రోజు మూడు గంటల పాటు సాధన చేస్తూ పట్టు సాధిస్తోంది. ఒకసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడంతో పాటు పదిసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసింది.

## ఉమ్మడి జిల్లా డీడీవోపీగా శరత్



**కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే:** కరీంనగర్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దరావత్ శరత్‌ను తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వారు నియమించారు. శరత్ గతంలో హుజూరాబాద్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో అదనపు పీపీగా బాధ్యతలు నిర్వర్తించి, పదోన్నతిపై కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. ఇక్కడ శరత్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాసిక్యూటర్ల పరిపాలన బాధ్యతలు చూస్తారు. మహబూబ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీగా ఉన్న రాంలక్ష్మణ్ పదోన్నతిపై కరీంనగర్ జిల్లా కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బదిలీ కాగా ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. హుజూరాబాద్ అసిస్టెంట్ సెషన్ కోర్టుకు ఇన్‌ఛార్జి అదనపు పీపీగా గౌరు రాజిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

## పోక్సో కోర్టు పీపీగా కుమారస్వామి



**కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే:** కరీంనగర్ జిల్లా కోర్టులోని మొదటి పోక్సో (బాలికలపై అత్యాచారాలను నిరోధించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థానం) కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, న్యాయవాది పంజాల కుమారస్వామి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామానికి చెందిన కుమారస్వామి రైతు కుటుంబం నుంచి వచ్చారు. జిల్లా కోర్టులో 2005 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు.

## నేడు ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలు



**కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే:** కరీంనగర్, జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ జిల్లాల అసోసియేషన్ కార్యదర్శులు సంపత్‌కుమార్, జి.శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫొటో, పుట్టినరోజు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటలలోపు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈనెల 5, 6న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

## ఎంగిలి పూల బతుకమ్మకు సర్వం సిద్ధం

ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ పూలతో తొమ్మిది రోజులు సందడి చేసే పూల పండుగ బతుకమ్మ రానే వచ్చింది. ఆడపడుచుల సంబురమిది. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చుకొని మనసారా కొలుస్తూ ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతారు. మహాలయ అమావాస్యతో ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై దుర్గాష్టమితో నవరాత్రులతో ముగిసే పండుగే బతుకమ్మ. బుధవారం ఊరూరా, వాడవాడలో ఆడుకొనేందుకు రెండ్రోజుల నుంచే పూల సేకరణతోపాటు ఇతరత్రా ఏర్పాట్లతో ఇళ్లల్లో సందడి నెలకొనిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎంగిలి బతుకమ్మ వేడుకలను బ్రహ్మాండంగా నిర్వహించుకునేలా కూడళ్లను చదును చేశారు. లైటింగ్ సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల నుంచి పూలను సేకరించి నగరంలో అన్ని ప్రధాన రహదారులతోపాటు మార్కెట్ రోడ్డులో విక్రయానికి రహదారులు కిటకిటలాడాయి.

- న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం



కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

## నేడు జమ్మికుంట మార్కెట్‌కు సెలవు

**జమ్మికుంట, న్యూస్‌టుడే:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 35 ట్రాలీల కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,800 ధర పలికింది. 83 క్వింటాళ్ల బస్తాల కొత్తపత్తిని రూ.5,500 నుంచి రూ.6,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. సోమవారం కంటే తాజాగా కొత్తపత్తి ధర రూ.100 పెరిగింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి మల్లేశం పరిశీలించారు. గాంధీ జయంతి, అమావాస్య సందర్భంగా బుధవారం మార్కెట్‌కు సెలవు అని ఆయన తెలిపారు.



# గణనీయంగా సన్నాల సాగు

### ఉమ్మడి జిల్లాలో రికార్డుస్థాయిలో వరి విస్తీర్ణం

ఈనాడు, సిరిసిల్ల

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

వ్యవసాయశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం రికార్డుస్థాయిలో వరి సాగులో కిరాగా సన్నగింజ రకాల సాగు భారీగా పెరిగింది. నిరుడు 9.60 లక్షల ఎకరాల్లో ఈ సీజన్‌లో 9.82 లక్షల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగుచేశారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో మొత్తం వరి సాగు 3.16 లక్షల ఎకరాలు కాగా కరీంనగర్ 2.76, పెద్దపల్లి 2.09, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.81 లక్షల ఎకరాలుగా నమోదైంది. నాలుగు జిల్లాల్లో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డుగింజ రకాలుండగా 3.76 లక్షల ఎకరాల్లో సన్నగింజ రకాలున్నట్లు అధికారులు గుర్తించారు.

గతంలో ఉమ్మడి జిల్లాలో సన్నాలసాగు లక్ష ఎకరాల్లోపే ఉంటుండగా ఈ సారి రాష్ట్రప్రభుత్వం సన్నగింజ రకాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామనటంతో సన్నాల సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం సేకరించే సన్నగింజ రకాల పేర్లను ఆలస్యంగా వెల్లడించటం, కేవలం వ్యవసాయ వర్సిటీల్లో రూపొందించిన రకాలనే కొనుగోలు చేస్తామనటం, ప్రభుత్వం సూచించిన రకాల విత్తనాలు లభించకపోవటం, సన్నాల సేకరణ, బోనస్ చెల్లింపుపై అనుమానాలతో చాలామంది రైతులు దొడ్డుగింజ రకాలనే సాగుచేశారు. ప్రభుత్వం ముందుగా రకాలు, సేకరణపై స్పష్టమైన ప్రకటన చేసి ఉంటే సన్నాలసాగు మరో లక్షన్నర ఎకరాలకుపై పెరిగే అవకాశముండేది. ప్రస్తుతం ఫైన్ రకాలకు క్వింటాలుకు రూ.2,320, కామన్ రకాలకు రూ.2,300 ధరుండగా సన్నగింజ రకాలకు ఈ ధరకన్నా క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ప్యాక్స్, ఐకేపీ, డీసీఎంఎస్, రైతుసంఘాలు, ఎఫ్‌పీవోలు తదితరాల ద్వారా ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1,370 కిపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా సన్నగింజ, లావుగింజ రకాలకు వేరువేరు కేంద్రాల ద్వారా దాదాపుగా 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. ముందుగా నాటిన వరిపైరు గొలకదశలో ఉండగా వరి నూర్పిడులను బట్టి అక్టోబరు మొదటి వారం నుంచి కేంద్రాలను తెరచి ధాన్యం సేకరణ చేపట్టనున్నారు. అయితే గాలివానతో గొలకదశలోని వరిపైరు పడిపోవటం, ప్రతికూల వాతావరణంతో సన్నగింజ రకాల్లో చీడపీడల తీవ్రత పెరగటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.



హుజూరాబాద్ ప్రాంతంలో ఎండాకు తెగులు సోకిన వరిపంట

### చీడపీడల వ్యాప్తికి అనుకూలం - వాణి, జిల్లా వ్యవసాయాధికారిణి, జగిత్యాల



ఈ సీజన్‌లో సన్నగింజ రకాల సాగు గణనీయంగా పెరిగింది. విస్తారంగా వర్షాలు కురిసి ఒక్కసారిగా ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ఉక్కపోత వాతావరణం చీడపీడల వ్యాప్తికి అనుకూలంగా మారింది. సన్నరకాల్లో సుడిదోమలు, తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉండి దిగుబడులను ప్రభావితం చేసే అవకాశమున్నందున పంటపై ఏవేని అసహజ లక్షణాలుంటే అధికారులు లేదా శాస్త్రవేత్తలతో నిర్ధారించుకుని నివారణ చేపట్టాలి.

### దిగుబడులపై ప్రభావం - డాక్టర్ టి.కిరణ్‌బాబు, వ్యవసాయ వర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త



బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు 15-20 కిలోల పొటాష్‌ను వేయాలి. సుడిదోమల వ్యాప్తి నిరోధానికి యూరియాను ఎకరాకు 20-25 కిలోలే చల్లాలి. దోమల తీవ్రతను బట్టి పొలాన్ని ఆరగట్టాలి, తొలిదశలో బ్యుప్రొఫెజిన్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ ఇమిడాక్లోప్రిడ్ మిశ్రమ మందు 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొదళ్లపై దోమలు ఎక్కువుంటే డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాములు ట్రైఫ్లూమెజోఫైరిమ్ 0.48 మి.లీ లేదా ఎథిప్రోల్ ఇమిడాక్లోప్రిడ్ 0.25 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పొలాన్ని పాయలుగాచేసి మందుద్రావణం మొక్కల మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి.

## నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



**చొప్పదండి, న్యూస్‌టుడే:** చొప్పదండి నవోదయ పాఠశాలలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మంగతాయారు మంగళవారం ప్రకటనలో కోరారు. 2025-26 సంవత్సరానికిగాను 8వ తరగతి చదువుతున్నవారు 9వ తరగతికి, పదో తరగతి చదువుతున్న వారు 11వ తరగతికి ఈనెల 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## 5 నుంచి బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

**కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ నాలుగో సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) పరీక్షలు ఈనెల 5 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

## కరీంనగర్ క్రికెట్ జట్టు శుభారంభం



**కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన ఉమ్మడి అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. కరీంనగర్ జట్టు తరఫున తక్షిల్ 51 పరుగులు, రిత్విక్ 33 పరుగులు, బౌలింగ్‌లో అర్షద్ 4 వికెట్లు, విగ్నేష్ 3 వికెట్లు, వంశీ 2 వికెట్లు సాధించారు. అర్షద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైనట్లు టీం మేనేజర్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు, తెలిపారు. జట్టు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు వి.ఆగంరావు, శరత్, తదితరులు అభినందించారు.

## యువకుడి దారుణ హత్య

### కుటుంబ కలహాలే కారణమా?

**జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే :** జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబసభ్యులు కనిపించకుండా పోవడంతో కుటుంబ కలహాలే హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కథనం మేరకు.. అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్‌రాజు (35) కొన్నాళ్లు గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. అవివాహితుడైన ఇతను తల్లిదండ్రులు, సోదరుడు విక్రమ్‌రాజు కుటుంబంతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతుండటంతో కుటుంబంలో కలహాలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం. మంగళవారం సాయంత్రం ఇంట్లో గొడవ జరిగింది. కొద్దిసేపటికి సందడి లేకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా ఇంటి ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్న విద్యాసాగర్‌రాజు మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ సదాకర్ మృత దేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. విద్యాసాగర్‌రాజు తల, మెడపై తీవ్ర గాయాలున్నాయి. పోలీసుల విచారణ సమయంలో అక్కడికి వచ్చిన విక్రమ్‌రాజు తరవాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విద్యాసాగర్‌రాజు తల్లిదండ్రులు, విక్రమ్‌రాజు భార్య, ఏడాదిన్నర కుమారుడు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ కలహాలే హత్యకు కారణమని అనుమానాలు ఉన్నాయని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



విద్యాసాగర్‌రాజు